"పట్టు చీరకొనకతప్పదు" అన్నది మంగళ.

రాజు నవ్వి "నన్నడిగి ప్రయోజనం లేదు. నాన్నని అడుగు. అంతా నాన్న ఇష్టం" అన్నాడు.

"పెళ్ళి చేసికొనేది నువ్వు. కట్నం నీ పెళ్ళి గురించి నీకు ఇస్తున్నారు. అలాంటప్పుడు నేను పట్టుచీర కొనమని నిన్నే అడగటం న్యాయం" అన్నది మంగళ మళ్ళీ.

"కట్నం నా పెళ్ళి గురించే ఇస్తున్నారు. నిజమే చెల్లెమ్మా.... కానీ ఆ డబ్బును నేను తీసుకోవడం లేదు. నాన్న తీసుకుంటున్నాడు. అందువల్ల నీవు నాన్ననే అడగాలి" అన్నాడు.

ఈ పట్టుచీర గురించి రాజుకి-మంగళకి కొంచెం సేపు వాదన జరిగింది.

కొంచెం సేపటి తర్వాత రాజు ఇలా అన్నాడు.

"ఆడపడుచు లాంఛనాల రూపంలో నీకు వెయ్యి రూపాయలు ఇస్తున్నారు కదా! ఆ డబ్బుతో నువ్వు పట్టుచీర కొనుక్కోరాదూ"

"నీ ఆలోచన బాగానే వుంది. లాంఛనం వాళ్ళు ఇస్తున్నారు. నువు కాదు. నేను నీ పెళ్ళి గురించి పట్టు చీర కొనివ్వమని అడుగుతున్నాను. ఎంతో ఖరీదు వుండదు. ఆరొందలు ఇస్తే చాలు" అన్నది మంగళ.

రాజు వెంటనే మాట్లాడలేదు.

అతను ఓ బ్యాంకులో ఎనిమిది నెల్లనించీ ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి ఓ పదిహేను రోజుల క్రితం ఓ సంబంధం వచ్చింది. ఆ అమ్మాయి పేరు సత్యవతి. చూడగానే రాజు మనసును ఆ అమ్మాయి అందం ఆకర్షించింది. సత్యవతి ఇంటర్ వరకు చదువుకోవటం వల్ల ఆ విషయంలో కూడా అతనికేమీ అభ్యంతరం కనిపించలేదు.

ఆ తర్వాత రాజు తండ్రి డిమాండ్ చేసిన పదహారు వేల కట్నాన్ని సత్యవతి తండ్రి ఇవ్వటానికి అంగీకరించాడు. ఇతర లాంఛనాల బేరం కూడా కుదిరిపోయిన తర్వాత రెండు రోజుల క్రితమే ముహూర్తాలు పెట్టుకున్నారు. ఇంకో తొమ్మిది రోజుల్లో వుంది రాజు పెళ్ళి.

ముహూర్తాలు పెట్టుకునే రోజునే రాజు తండ్రి అడిగినట్లుగా సత్యవతి తండ్రి ఎనిమిది వేల రూపాయలను కట్నం ఎడ్వాన్స్‌గా ఇచ్చాడు.

రాజు తల్లిదండ్రులు పెళ్ళికి కావలసిన వస్తువులు తీసుకు రావడానికి బజారుకు వెళ్ళారు.

ప్రతాప రవిశంకర్



# సత్యవతి సమాధానం

ఆ ఇంట్లో ప్రస్తుతం అన్న-చెల్లెలు వున్నారు.

వాళ్ళ మధ్య పట్టుచీర గురించి. సంభాషణ అలా జరుగుతున్నది ఇక-రాజు మౌనంగా వుండటాన్ని చూసి "ఏమిటి బ్రదర్ ఆలోచిస్తున్నావ్? ఆరొందలు అనేసరికి దిగులుగా వున్నదా?" అన్నది నవ్వుతూ మంగళ.

"సర్లే! నీ ఇష్టమయినట్లే కొనుక్కో మంగళా ....నాన్నను అడిగి నీకు డబ్బు ఇప్పిస్తాను. మరో విషయం-నా మనసులో వున్న మాట నీకు చెబుతున్నాను. నా పెళ్ళికి కట్నం తీసికోవడం

నాకు ఇష్టం లేదు'' అన్నాడు రాజు.
ఒక్క క్షణం ఆశ్చర్యపడి "అదే మిటి!''అన్నది చెల్లెలు.
"అవును. నీ పెళ్ళికూడా కట్నం ఇవ్వాలి కాబట్టి నేను ఇందుకు ఒప్పుకున్నాను. లేకపోతే ఒప్పుకునే వాడిని కాదు'' అన్నాడు కొంచెం బాధగా.
అతనెందుకు బాధపడుతున్నాడో మంగళకు అర్థంకాలేదు.
''తీసుకునేటప్పుడు తీసుకుంటాం. ఇచ్చేటప్పుడు ఇస్తాం- ఇందులో బాధపడడానికి ఏముంది!'' అన్నది అది చాలా సహజమైన విషయము యినట్టు....
"నువ్వు ఈ విషయం గురించి చాలా ఈజీగా మాట్లాడుతున్నావు. ఈ కట్నాల గురించి చాలా మంది అమ్మాయిల తల్లిదండ్రులు ముసలి వాళ్ళకు- దుర్మార్గుడని తెలిసినా ఆ మగవాడికే ఇచ్చి కన్నెచెర వదిలించుకుంటున్నారు. చాలామంది తల్లిదండ్రులు కూతురు భవిష్యత్తు కంటె ముందు ఏదో విధంగా ఆమెను వదిలించుకొని బరువు దించుకోటానికే చూస్తున్నారు. దీనికాృరణం ఏమిటి? ఈ కట్నం సమస్యే కదా'' అన్నాడు.
మంగళ అతని అభిప్రాయాన్ని ఒప్పుకోలేదు.
"కూతురు భవిష్యత్తును ఆలోచించకుండా పెళ్ళిళ్ళు చేసే తల్లిదండ్రులు లక్షమందిలో ఒకరిద్దరు వుంటారు. అలాంటి వాళ్ళ గురించి మనం మాట్లాడుకోవలసిన అవసరం లేదు'' అన్నది.
ఈ విషయం గురించ కూడా వాళ్ళి ద్దరికి చాలా సేపు వాదన జరిగింది. చివరికి రాజు నవ్వి :'అయితే నేను నా ఆలోచన నిజమైనదని నిరూపించుకుంటాను. బెట్ కడతావా?'' అన్నాడు.
"ఎలా నిరూపిస్తావు?''
"ఎలాగో చెబుతాను. ఇప్పుడు మనం ఒక ప్రయోగం చేద్దాం. అదేమిటంటే నేను మంచి వాణ్ని కాదనీ- నాకు అన్ని రకాల చెడు అలవాట్లు వున్నాయనీ- ఇద్దరు అమ్మాయిలను పెళ్ళి చేసుకుంటానని మోసం చేశాననీ- నన్ను చేసి కుంటే ఆ అమ్మాయి జీవితం నాశనం అవుతుందనీ, ఈ సంబంధం వదులుకోమనీ- నేను చెప్పినట్లుగా నాకాృబోయే మామ గార్కి ఆకాశరామన్న లాగా ఓ ఉత్తరం రాసి పోస్టు చెయ్యి. ఆ ఉత్తరం చూసుకుని ఆయన మన దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చాడంటే నువ్వు గెలిచినట్టె....అలా కాకుండా మామూలుగానే నా పెళ్ళి

జరిగిపోయిందంటే నువ్వు ఓడి పోయినట్టు -- ఏమంటావ్?" అన్నాడు.
"వద్దు....ఒకవేళ పెళ్ళి ఆగిపోతుందేమో." అన్నది మంగళ.
ఏ పెళ్ళి ఆగిపోదు. ఒకవేళ అటువంటి పరిస్థితి వస్తే ఆ ఉత్తరాన్ని మనమే రాశామని బయట పెడదాం. మరి బెట్ కడతావా?"
"ఎంత?" అన్నది.
"నువ్వు గెలిస్తే నీకు వెయ్యి రూపాయలిస్తాను. నువ్వు ఓడి పోతే నీకు లాంఛనంగా వచ్చే వెయ్యి రూపాయలు నాకిచ్చెయ్యి" అన్నాడు.
అందుకు ఒప్పుకున్నది మంగళ.
రాజు ఆమెకు ఓ ఉత్తరాన్ని డిక్టేటు చేశాడు. అతను చెప్పినట్టుగానే కొంచెం భయంకరంగా రాసింది ఆమె. తర్వాత అప్పుడే ఆ ఉత్తరాన్ని పోస్టు చెయ్యడానికి బయల్దేరింది.
"ఇది చాలా గొప్ప రహస్యం. నువ్వు ఎక్కడా బయట పెట్టకు" అన్నాడు రాజు.
"సర్లే" అన్నది మంగళ వెళుతూ.

* * *

నాలుగు రోజులు గడిచాయి. అయినా సత్యవతి ఇంటినించి ఎవ్వరూ రాలేదు రాజు ఇంటికి. ఆ ఉత్తరం అందలేదేమోనని మరో రెండు ఉత్తరాలను రాసి తనే స్వయంగా పోస్టుచేసింది మంగళ.
పెళ్ళిరోజు కూడా వచ్చింది. అయినా మంగళ ఆశించినట్టుగా పెళ్ళి కూతురి తండ్రి ఆ ఉత్తరాల గురించి మాటాడటానికి రాలేదు. చివరికి రాజు పెళ్ళి సత్యవతితో జరిగిపోయింది. కనీసం వాళ్ళు ఈ విషయం గురించి బాధపడుతున్నట్టు కూడా మంగళకు అనిపించలేదు.
ఆమె ఓడిపోయింది.
వెయ్యి రూపాయలు అప్పట్ అనుకున్నది.
పెళ్ళి కూతురు - ఆమె తల్లి దండ్రులు, అంత హుషారుగా వుండటం రాజుకి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఉత్తరాలు అందలేదేమో అనుకున్నాడు.
కాని ఒక్క ఉత్తరం కూడా అందకుండా ఎలా ఉంటుంది?
సత్యవతిని గదిలోకి పంపించిన తర్వాత ఆమె కొంత సిగ్గును పోగొట్టుకున్న తర్వాత "ఉత్తరాలు అందలేదా?" అన్నాడు చిన్నగా.
పెళ్ళికూతురు ఉలిక్కిపడి "వాటి గురించి మీకెలా తెలుసు?" అన్నది.
"అయితే ఆ ఉత్తరాలు మీకు అందాయన్న మాట. మరి ఆ ఉత్తరాలు

చదివి కూడా ఏమీ తెలియనట్టు వూరుకున్నారేమిటి?”

అప్పుడు సత్యవతి “సర్లెండి: ఆ ఉత్తరాల గురించి ఎవరు పట్టించు కుంటారు? నాకో బావ వున్నాడు. వాడో జులాయి వెధవ. వాడికి నన్ను పెళ్ళి చేసుకోవాలని ఉంది. ఐనా వాడ్నెవరు చేసుకుంటారు? వాడు నా మీద కోపంతో ఇంతకు ముందు కూడా ఓ పెళ్ళి కొడుకు గురించి రాశాడు. మేము నిజమే అనుకుని ఆ సంబంధాన్ని వదులు కున్నాం. తరువాత తెలిసింది ఆ ఉత్తరాన్ని వాడే రాయించాడని. ఈసారి కూడా ఈ ఉత్తరాలను మా బావ వెధవ రాసి ఉంటాడని వాటిని చించి పారేశాడు మా నాన్న. ఐతే ఆ ఉత్తరాలను ఇంతకీ మా బావ వెధవ రాయలేదా?” అని ఎదు రడిగింది సత్యవతి.

వెంటనే రాజు పెద్దగా నవ్వి. “ఓహ్! బ్యూటిఫుల్ ఎండింగ్! పాపం! మా చెల్లెలు వెయ్యి రూపా యలు పోయాయని ఒకటే కుమిలి పోతోంది” అన్నాడు.

సత్యవతికి అతని మాటలు అర్థం ఆవక “మీ చెల్లెలు వెయ్యి రూపా యలు పోవటం ఏమిటి? ఎప్పుడు పోయాయి? పెళ్ళిలోనా?” అన్నది కంగారుగా.

“అదంతా ఒక కథలే సత్యవతీ! ఇప్పుడు మనం కథలతో కాలం గడపకూడదు. ఇది మన మొదటి రాత్రి!” అన్నాడు రాజు వస్తున్న నవ్వును బలవంతంగా నొక్కిపట్టి- సత్యవతిని తన గుండె కేసి అదిమి పెట్టి.

---

## కార్టూనిస్టులకు మనవి!

కార్టూన్లను రంగుల్లోనూ, హాస్య సంచికను ఆఫ్ సెట్ ప్రింటింగ్‌లోనూ వెలువరిస్తున్న ఏకైక పత్రిక 'విజయ.' కార్టూనిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా రని ఆశిస్తూ, 'విజయ' 'హాస్య' సంచికకు పంపే కార్టూన్లు 13 సెం. మీ. వెడల్పు 8 సెం. మీ. ఎత్తు-సైజులో గీసి పంపవలసిందిగా కోరుతున్నాము. కార్టూన్ వ్యాఖ్య ఎంత క్లుప్తంగా వుంటే అంత మంచిది. —సంపాదకుడు.